క్లుప్తంగా

గురుకుల పాఠశాలలో కోర్సుల ప్రవేశానికి పరీక్షలు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని బెస్తవారిపల్లె గ్రామ సమీపంలో ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఈనెల 10వ తేదీ ఆదివారం 2024–2025 అకడమిక్ సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, 5వ తరగతి ఇంగ్లీష్ మీడియం కోర్సుల ప్రవేశం కొరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చిట్టిబాబు తెలిపారు. 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, అలాగే ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా దరఖాస్తు చేసుకుని వారు ఉంటే కళాశాల వద్దకు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9704550134 ,7981753315లను సంప్రదించాలన్నారు.

గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ చైర్మన్‌గా సుధీకర్‌రెడ్డి



పులివెందుల : పులివెందుల గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ చైర్మన్‌గా చింతకుంట సుధీకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మళ్లీ తనకు చైర్మన్‌గా పదవీ కాలం పొడగించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి, కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ఆలయాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయల నిధులను విడుదల చేస్తున్నారన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఈఓ అనురాధ

పెండ్లిమర్రి : పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిని అనురాధ తెలిపారు. మండలంలోని గంగనపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన పదవ తరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. ముందుగా మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. పరీక్షలల్లో ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలకు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సావిత్రిదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామాలయానికి భూమిపూజ

పులివెందుల టౌన్ : స్థానిక చిన్నరంగాపురంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీసీతారాముల ఆలయానికి బుధవారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్‌యార్డు చైర్మెన్ చిన్నప్పలు హాజరై భూమిపూజ నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ శివలక్ష్మి ఆధ్వర్యంలో వారికి ఘన సత్కారం చేశారు. జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లె కిషోర్, కౌన్సిలర్ కోడిరమణ, అంకాలమ్మ ఆలయ చైర్మన్ నాగేంద్ర ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంప్లెక్స్ పనుల పరిశీలన

పులివెందుల టౌన్ : స్థానిక బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన వైఎస్ జయమ్మ కాంప్లెక్స్‌ను బుధవారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్‌లు పరిశీలించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటన సందర్భంగా అభివృద్ధి పనులు వేగవంతం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ రమణారెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

వేంపల్లె : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యోగాంజనేయులు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కమిషనరేట్ ఆఫ్ కాలేజీయట్ ఎడ్యుకేషన్ (ఏపిసిసిఇ) నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్‌కెఆర్ డిగ్రీ కళాశాల కడప ఆధ్వర్యంలో జాబ్ ఫెస్ట్ 2024 ఉంటుందన్నారు. జాబ్ మేళా నందు వివిధ కంపెనీలు పాల్గొననున్నట్లు వెల్లడించారు. డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న బీకామ్, బీఏ, బీఎస్సీ విద్యార్థులు తప్పనిసరిగా హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్లేస్మెంట్ అధికారి అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన భాగవత సప్తాహ పఠనం

వేముల : మండలంలోని పెర్నపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరామాలయంలో నిర్వహించిన భాగవత సప్తాహ పఠనం బుధవారం ముగిసింది. గ్రామంలో భాగవత సమాజ్ ఆధ్వర్యంలో పలు గ్రామాలకు చెందిన భాగవత సప్తాహ పఠనం చదివే వారు భాగవత సప్తాహం నిర్వహించారు. వీరికి గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి అన్ని ఏర్పాట్లు చేశారు. భాగవత సప్తాహం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక భావాలు అలవరచుకోవాలన్నారు. 7 రోజులపాటు జరిగిన ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు భాగవత సమాజ్ బృందానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మహాశివరాత్రికి ఆలయాల ముస్తాబు

చక్రాయపేట : స్థానిక శ్రీవేంకటేశ్వర, రాచరాయ స్వామి ఆలయాలు మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబవుతున్నాయి. ఎంతో చరిత్ర కలిగిన ఈ ఆలయాలు శిథిలావస్థకు చేరుకోవడంతో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రూ.40 లక్షలు మంజూరు చేయడంతో అవి నూతన శోభను సంతరించుకున్నాయి. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక ఈ ఆలయాలకు అనుసంధానంగా కల్యాణమండపం నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. ఈ మండపాన్ని ఇటీవల కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డిలు ప్రారంభించారు. గత పదేళ్లుగా నిర్వహిస్తున్న ఉత్సవాలను ఈ యేడుకూడా శివరాత్రి రోజు ఘనంగా జరిపించనున్నామని ఆలయ కమిటీ తెలిపింది. ఉదయం నుంచి రాత్రి వరకు పెద్ద ఎత్తున అన్న సంతర్పణ, బండలాగుడు పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రామోత్సవం నిర్వహించనున్నారు. బండలాగుడు పోటీలలో మొదటి బహుమతి రూ.70వేలు, రెండవ బహుమతి రూ.60 వేలు, మూడవ రూ.50 వేలు, నాల్గవ రూ.40 వేలు, ఐదవ రూ.30 వేలు, ఆరోవ రూ.20 వేలు, ఏడోవ రూ.10 వేలు, పోటీలకు హాజరైన మిగిలిన ఎడ్లకు జతకు రూ.5వేలు చొప్పున బహుమతులు ఉంటాయన్నారు. భక్తులు పెద్ద ఎత్తున వేడుకల్లో పాల్గొనాలని వారు కోరారు.



చక్రాయపేట : ఆలయాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు



పొలతల ఆలయ అవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిర్లు

పొలతలలో ..

పెండ్లిమర్రి : పొలతల క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా గురువారం నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ అంబటి నాగమల్లారెడ్డి, ఈఓ శ్రీనివాసులు తెలిపారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. శుక్రవారం చండీ హోమం, పూర్ణాహుతి, రథ ప్రతిష్ఠ,కుంకుమార్చన అనంతరం ఉదయం 9.30 గంటల నుంచి ముత్యాల తలంబ్రాలతో శివపార్వతుల కల్యాణం, రాత్రి 10 గంటలకు రథోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. శనివారం ముంగింపు ఉత్సవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు కడప, పులివెందుల, ప్రొద్దుటూరు, రాయచోటి డిపోల నుంచి బస్సు సర్వీస్‌లను కేటాయించారన్నారు. కడప డీఎస్పీ షరీఫ్, సీఐ నాగరాజు ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మొగమూరు, పాపాఘ్ని, పావని నదుల సంఘమం వద్ద వెలసిన సంగమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త శివాంజనేయరెడ్డి పూర్తి చేశారు. గోపురాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ప్రత్యేక క్యూలైన్‌లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం 2 గంటల నుంచి ఆలయంలోని మూలమూర్తులకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, ఉదయం 7 గంటలకు నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, బండలాగుడు పోటీలు, చెక్కభజన, కోలాటాలు, డాన్స్ బేబి డాన్స్, కూచిపూడి నాట్యం, పౌరాణిక నాటకం, రాత్రి 12 గంటలకు శివపార్వతుల కల్యాణం తదుపరి గ్రామోత్సవం ఉంటుందన్నారు. షిర్డిసాయి ఎలక్ట్రికల్స్ ఎండీ విశ్వేశ్వర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, డాక్టర్ కరుణాకర్‌రెడ్డి (అశ్విని హాస్పిటల్) కడప వారిచే ఉదయం 10 గంటల నుంచి రాత్రి వరకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.



వీరపునాయునిపల్లెలోని సంగమేశ్వరుడు

నేడు కడప ఎంపీ రాక..

సింహాద్రిపురం : మండలంలోని పైడిపాళెం ప్రాజెక్టు నూతన భవనం, సీసీ రోడ్డు ప్రాజెక్టు వద్ద వైఎస్ఆర్ విగ్రహాన్ని గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభిస్తాడని వై ఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

వేముల : కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి గురువారం మండలంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మబ్బుచింతలపల్లి, పెద్దజూటూరు, చాగలేరు, నల్లచెరువుపల్లె గ్రామాల్లో నిర్మించిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ క్లీనిక్‌లను ప్రారంభిస్తారన్నారు.

తొండూరు : మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి గురువారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రానున్నట్లు తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి, తొండూరు మండల అధ్యక్షుడు రవీంద్రారెడ్డిలు తెలిపారు. మొదట గోటూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ క్లీనిక్, తదితర అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారు. అనంతరం అగడూరు గ్రామానికి చేరుకుని నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతుభరోసా, వైఎస్సార్ విలేజ్ క్లీనిక్, డిజిటల్ లైబ్రరీలను ప్రారంభిస్తారు. అలాగే మల్లేల గ్రామంలో దాదాపు రూ.46 కోట్లతో నిర్మించిన బీసీ బాలికల గురుకుల పాఠశాలను ప్రారంభిస్తారు. గిడ్డంగుల భవనం, షాదీఖానాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

మసీదుల అభివృద్ధికి రూ.5.56 కోట్లు

పులివెందుల టౌన్ : పట్టణంలోని పలు మసీదుల అభివృద్ధి పనుల కోసం పాడా నిధుల నుంచి రూ.5.56 కోట్ల నిధులను మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల కృషి అభినందనీయమని వైఎస్సార్‌సీపీ ముస్లిం నాయకులు నూరుల్లాహ్ తెలిపారు. బుధవారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్‌లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డిలు మసీదులను పర్యవేక్షించారు. పట్టణంలో 18 మసీదులు ఉండగా అందులో పలు మసీదుల అభివృద్ధి కోసం రూ.5.56 కోట్ల పాడా నిధులు మంజూరు చేశారన్నారు. అందులో భాగంగా మహమ్మదీయ మసీదుకు రూ.27లక్షలు, కూబా మసీదుకు రూ.40లక్షలు, ఈసూబ్ మసీదుకు రూ.9లక్షలు, ఉస్మాన్ మసీదుకు రూ.14లక్షలతో అభివృద్ధి చేసిన మసీదులను వారు పర్యవేక్షించారు. అలాగే ప్రతి ముస్లిం సోదరులకు ఎలాంటి సమస్య వచ్చినా వైఎస్ కుటుంబ సభ్యులు పరిష్కరిస్తూ వస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ముస్లిం సోదరులందరు వైఎస్ కుటుంబానికి అండగా నిలిచి మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్య మంత్రిని చేసుకుని రుణం తీర్చుకుందామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీ జ్, కౌన్సిలర్ ఖాదర్ బాషా, రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, మసీదుల ధర్మకర్తలు, మత పెద్దలు పాల్గొన్నారు.



ముస్లిం మత పెద్దలతో మాట్లాడుతున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

10న ప్రవేశ పరీక్ష

కమలాపురం : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశమునకు ఈనెల 10వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తులశమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపురం గురుకుల పాఠశాల కేంద్రంలో 5వ తరగతిలో ప్రవేశం పొందే విద్యార్థులకు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, అలాగే ఇంటర్‌లో ప్రవేశం కోసం మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు ఈ ప్రవేశ పరీక్షలు ఉంటాయన్నారు. ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. హాల్‌టికెట్‌లో ఫొటో తప్పుగా ఉన్నవారు సంబంధిత హెచ్‌ఎంతో స్టడీ సర్టిఫికెట్, ఒరిజినల్ ఆధార్ కార్డు వెంట తీసుకుని రావాలన్నారు.

నేడు చిలంకూరుకు ఎమ్మెల్యే రాక

ఎర్రగుంట్ల : మండలంలోని చిలంకూరులో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ కార్యాలయ భవనాలను గురువారం ఉదయం ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గ్రామ సచివాలయం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాల ప్రారంభోత్సవాలను వియవంతం చేయాలని ఆయన కోరారు.

చంద్రబాబును బీసీలు నమ్మే పరిస్థితిలో లేరు

పులివెందుల టౌన్ : బీసీలోని కులాలవారు ఎవరూ టీడీపీ అధినేత చంద్రబాబును నమ్మే పరిస్థితుల్లో లేరని..ఎన్నికల సమయంలో చంద్రబాబుకు బీసీలు గుర్తుకొచ్చారా అని వడ్డెర సంఘ రాష్ట్ర జనరల్ సెక్రటరీ, మున్సిపల్ చైర్మన్ వల్లెపు వరప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక వైఎస్ మనోహర్ రెడ్డి స్వగృహం ఆవరణలో బీసీ నాయకులతో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలు ప్రజలు పెడచెవిన పెట్టడమే కాదు కనీసం వినడం లేదన్నారు. చంద్రబాబు–పవన్‌కల్యాణ్‌లకు బీసీ సభ నిర్వహించే అర్హత ఉందా అన్ని ప్రశ్నించారు. 2014లో అధికారంలోకి రావడానికి చంద్రబాబు 600లకు పైగా హామీలిచ్చారన్నారు. ఒక్క హామీనైనా వందశాతం అమలు చేశారా అన్నారు. అమలు చేస్తే మెనిఫెస్టో దాచి పెట్టే పరిస్థితి, టీడీపీ అధికార వెబ్‌సైట్ నుంచి తొలగించే పరిస్థితి ఎందుకు వచ్చిందో చంద్రబాబు సమాధానం చెప్పగలరా అన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే నాదీ పూచి అన్న పవన్‌కల్యాణ్ ఏనాడైనా చంద్రబాబును ప్రశ్నించారా అన్ని ప్రశ్నించారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు జడ్జీలుగా పనికిరారు.. వారికి తెలివి ఉండదని కేంద్రానికి లేఖలు రాసిన చంద్రబాబు బడుగులకు న్యాయం చేస్తానని సభ నిర్వహిస్తే ప్రజలు నమ్ముతారా అన్నారు. బీసీల పిల్లలు పెద్ద చదువులు చదవడానికి తోడ్పాటు ఇవ్వకుండా ఇస్త్రీ పెట్టెలు, మోకులు, కత్తెరులు ఇచ్చింది చంద్రబాబు కాదా అన్నారు. వైఎస్సార్ ముఖ్యమంత్రి అయ్యాకనే బీసీ పిల్లలు ఉన్నత చదువులు చదివి విమానాల్లో వెళ్లి ఉద్యోగాలు చేస్తున్నారని..బీసీ మేధావులు గుర్తు చేస్తున్నారు. వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బడుగుల జీవితాల్లో విద్యా వెలుగులు నింపిందనేది విద్యావేత్తల అభిప్రాయమన్నారు. వృద్ధాప్య పింఛన్లను ఇచ్చేందుకు ఎన్ని ఇబ్బందు పెట్టారో అవ్వాతాతలకు తెలుసన్నారు. ఇప్పుడేమో రూ.4వేలు ఇస్తానని కాకమ్మ కతలు చెబితే ఎలా నమ్ముతారనుకుంటున్నారు. బీసీ అక్కచెల్లెమ్మల కోసం వైఎస్సార్ చేయూత పథకం తీసుకొచ్చారన్నారు. ఒక్క అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ, ఇళ్ల పట్టాల పంపిణీ చేశారన్నారు. ఇళ్ల నిర్మాణంలో అత్యధిక లబ్ధిదారులు బీసీ సోదరిమణులే ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు చంద్రమౌళి, కనక, మధు, సంపత్, దాసరి చంద్రమౌళి, ఆదినారాయణ ఆచారి, ఓబులేసు, హేమలత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

చేనేతలకు జగనన్న ప్రభుత్వంలోనే అధిక లబ్ధి

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : ముఖ్యమంత్రి జగనన్న ప్రభుత్వంలో మగ్గం కలిగిన ప్రతి నేతన్నకు మేలు జరిగిందని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం మైలవరం మండలంలోని వేపరాల గ్రామంలో ఆయన గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల ప్రజలు పొందిన లబ్ధిని వివరించారు. అనంతరం వారి సమస్యలను తెలసుకుని పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో చేనేత వృత్తిని నమ్ముకుని అనేక మంది జీవిస్తున్నారని గ్రహించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మగ్గం కలిగిన ప్రతి చేనేత కార్మికుడిని ఆదుకున్నాడన్నారు. ప్రతి ఏడాది రూ.24 వేలు నేరుగా వారి ఖాతాల్లో జమ చేశాడన్నారు. 50 సంవత్సరాలు కలిగిన నేతన్నకు పింఛన్ మంజూరు చేసిన ఘనత జగనన్నకు దక్కుతుందన్నారు. మైలవరం మండలానికి ఎక్కువ ఇళ్లు, ఇంటిస్థలాలను, పింఛన్లను మంజూరు చేశారన్నారు. ప్రజలు ముఖ్యమంత్రిగా జగనన్నను, ఎమ్మెల్యేగా తనను మరోసారి ఆదరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అలిశెట్టి కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి, వినయ్‌రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాల గురించి చేనేతలకు వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఘనంగా సీతారాముల కల్యాణం



ప్రత్యేక అలంకరణలో శ్రీ యోగారావ స్వామి, సీతా అమ్మవారు, లక్ష్మణ స్వామి

వల్లూరు : పెద్దపుత్త గ్రామంలో వెలసిన రామాలయంలో బుదవారం సీతారాముల కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. మూల విరాట్‌లకు అభిషేకాలను, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ ముఖద్వారం ప్రారంభం

చింతకొమ్మదిన్నె : స్థానిక మూలవంకలోని గంగమ్మ ఆలయానికి వెళ్లే ముఖద్వారాన్ని బుధవారం సీకేదిన్నె జెడ్పీటీసీ పి.నరేష్ రామాంజులరెడ్డి ప్రారంభించారు. అనంతరం గంగమ్మ జాతరకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళా యాదవ్, ఆలయ చైర్మన్ పీబీ విశ్వనాథరెడ్డి, ఆలయ కార్య నిర్వహణాధికారి పోతు సురేష్‌కుమార్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్లు గజ్జల శ్రీరామ్‌రెడ్డి, ముసల్‌రెడ్డి రాజారెడ్డి, సర్పంచులు వర్దిరెడ్డి సురేంద్రరెడ్డి, సుబ్బరాయుడు, మల్లికార్జున యాదవ్, ఎంపీటీసీలు వెంకటరెడ్డి, నాగరాజు, గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేష్ రామాంజులురెడ్డి

అభివృద్ధి కోసం ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి

– ఇంటింటి ప్రచారంలో డాక్టర్ రమ్యతారెడ్డి

కమలాపురం : రాష్ట్రం, నియోజకవర్గంలో మరింత అభివృద్ధి–సంక్షేమం కావాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తనయ డాక్టర్ రమ్యతారెడ్డి ప్రజలను కోరారు. బుధవారం మండల పరిధిలోని ఎర్రబల్లె, కొత్తపల్లె, వెకంటాపురం, పొడదుర్తి గ్రామాలలో ఆమె ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ఆమె రాకను పురస్కరించుకుని గ్రామాల మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ఆమె ప్రతి ఇంటి తలుపు తట్టి గత ఐదేళ్లలో రాష్ట్రంలో జగనన్న, నియోజకవర్గంలో తన తండ్రి అభివృద్ధి–సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. మరింత అభివృద్ధి–సంక్షేమ పథకాల కోసం త్వరలో జరిగే సాధారణ ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వైఎస్ అవినాష్‌రెడ్డి, పోచిమరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డిలను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. గత ప్రభుత్వాలు అభివృద్ధి, సంక్షేమం పూర్తిగా విస్మరించాయన్నారు. ఈ ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి–సంక్షేమం స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎప్పుడు జరగలేదన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా అభివృద్ధి పనులు కళ్లకు కనబడతాయన్నారు. ఇలాంటి పాలన అందించే వైఎస్సార్ సీపీని మరో సారి అధికారంలోకి తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్ రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, శ్రీరాం రమణ, రాఘవరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఓబుల్‌రెడ్డి, రెడ్డయ్య, ఎన్సీ పుల్లారెడ్డి, గంగాధర్‌రెడ్డి, హిదాయత్ పాల్గొన్నారు.



ఎర్రబల్లె కొత్తపల్లెలో ప్రచారం చేస్తున్న డాక్టర్ రమ్యతారెడ్డి

మొక్కలు.. ఆరోగ్యాల సిరులు

పులివెందుల టౌన్ : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంప్ అహోబిలాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పరిసర ప్రాంతాలను వలంటీర్లు శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వినోద్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రకృతిలో మొక్కలు వాతావరణ కాలుష్యాన్ని తగ్గిస్తాయని, వర్షాలు కురవడంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ పీఓ శ్రీనిత, వైస్ ప్రిన్సిపాల్ సుధీర్, సి.బాలనారాయణ, రెడ్డమ్మ, అధ్యాపక బృందం, తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా ఉపన్యాసం పోటీలు

పులివెందుల టౌన్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం, స్నేహిత అమృతహస్తం సేవా సమితిల సంయుక్త ఆధ్వర్యంలో ×ప్రస్తుత సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు₹ అనే అంశంపై బుధవారం ఏర్పాటు చేసిన ఉపన్యాసం పోటీలలో మహిళా విద్యార్థినులు పోటాపోటీగా పాల్గొన్నారు. ఒక్కో మహిళా విద్యార్థి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను, మహిళల పట్ల జరుగుతున్న వివక్షతలను ఈ ఉపన్యాసం పోటీలలో వివరించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా పీఆర్‌ఓ బాలనారాయణ, ఉమెన్స్ సెల్‌విభాగం విజయలక్ష్మి, రాధికలు వ్యవహరించారు. గెలుపొందిన విజేతలకు నేడు బహుమతులు ప్రధానం చేయనున్నారు. సేవాసమితి అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షురాలు అనూష, కార్యదర్శి సునీత, ప్రధాన కార్యదర్శి హేమలత, తదితరులు పాల్గొన్నారు.

మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం

పులివెందుల టౌన్ : స్థానిక బయమ్మతోట సచివాలయ పరిధిలోని 109, 110,115 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి బుధవారం మేము సిద్ధం ..మా బూతు సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్, పట్టణ కన్వీనర్లు హాల్ గంగాధర్‌రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లె కిషోర్‌లు పాల్గొని బూత్ కమిటీలోని కన్వీనర్లకు, బూత్ కమిటీ సభ్యులకు ఎన్నికల్లో చేయాల్సిన విధివిధానాలను దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వేంపల్లె : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నవరత్నాల ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్సీ ఎస్.వి.సతీష్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఉర్దూ షాదీఖానాలో మండల జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బూత్‌లెవెల్ కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని, ఈ వ్యవస్థల ద్వారా ప్రజల వద్దకే మెరుగైన ప్రభుత్వ పాలన అందుతుందన్నారు. మండల వ్యాప్తంగా సుమారు రూ.500కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరిగాయన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్య మంత్రి చేసుకుంటే మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. అందుకు సమిష్టిగా కృషి చేద్దామని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మిగాయత్రి, వైస్ ఎంపీపీలు రమణమ్మ, బాబాషరీఫ్, హజ్ కమిటీ డైరెక్టర్ మునీర్, ఏపీఎండిసి డైరెక్టర్ సల్మా, వైకాపా యువజన విభాగం అధ్యక్షులు రవిశంకర్‌గౌడ్, ఎంపీటీసీలు, సర్పంచులు, బూ త్ కమిటీ కన్వీనర్లు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నేత ఎస్.వి.సతీష్‌కుమార్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం పట్టణంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 300 మంది ఆయన అభిమానులు రక్తదానం చేశారు. ఆయన నివాస గృహంలో కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

గౌడ సంఘం ఆధ్వర్యంలో..

వేంపల్లె : వైఎస్సార్ కడప జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు రవిశంకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఎస్.వి.సతీష్‌కుమార్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా జిల్లాలోని గౌడ సంఘం డైరెక్టర్లు, సభ్యులు ఆయనను దుశ్శాలువాలతో పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

చక్రాయపేటలో పర్యటన..

చక్రాయపేట : మండలంలోని వైఎస్ఆర్‌సీపీ శ్రేనులు ఇడుపులపాయలో బుధవారం సతీష్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం సతీష్‌రెడ్డి చక్రాయపేట మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. తన వెంట నడచిన కార్యకర్తలను కలిశారు.



మాట్లాడుతున్న ఎస్.వి.సతీష్‌కుమార్‌రెడ్డి

లీకేజీలను అరికట్టండి సారూ...

కమలాపురం : పట్టణ పరిధిలోని పాతకచ్చేరి వీధి, పడమట వీధులలో తాగునీరు కలుషితం అవుతోందని, పైప్ లైన్ల లీకేజీ వల్లనే ఇలా జరుగుతోందని, లీకేజీలను అరికట్టాలని నివాసితులు నాగసేన, నాగేంద్ర, రాజేష్, శ్రీధర్, షఫీ తదితరులు తెలిపారు. గత నెల రోజులుగా తాగునీరు కలుషితం అవుతోందని, మున్సిపల్ అధికారులు సరఫరా చేస్తున్న నీటిలో దుర్వాసన వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజుల క్రితం కమీషనర్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని, కనీసం ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీలను అరికట్టి నీరు కలుషితం కావడాన్ని అరికట్టాలని వారు కోరుతున్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందాం

చక్రాయపేట : జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా వస్తేనే మనందరికీ మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయని జడ్పీటీసీ శివప్రసాదరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని ఆవులవాండ్లపల్లె, ఆంజనేయపురం గ్రామాల్లో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలగురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన హామీలను గాలికి వదిలి అక్కచెల్లెమ్మలను, రైతన్నలను మోసం చేశాడన్నారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా, అవినాష్ రెడ్డిని ఎంపీగా గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, ఎంపీటీసీ లీలావతి, సర్పంచ్ హర్షాద్, సింగిల్‌విండో అధ్యక్షుడు శేషారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామాంజులరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు గౌస్‌లాదం, నేతలు మాబువల్లీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులలో నైతిక విలువలు పెరగాలి

ఎర్రగుంట్ల : విద్యార్థులలో నైతిక విలువలను పెంపొందించాలని అప్పుడే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కేంద్ర కమిటీ డైరెక్టర్, కేరీర్ గైడెన్స్ చైర్మన్ రాటాల గోపి తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నైతిక విలువలు అనే అంశంపై ఆయన అవగాహన కల్పించారు.

జగనన్న సురక్ష.. ప్రజలకు ఆరోగ్య సంజీవిని



రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

సింహాద్రిపురం : మండల పరిధి గురిజాల గ్రామంలోని సచివాలయంలో బుధవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ రామ్‌శేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ప్రజలకు సంజీవినిలాంటిదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ముంగిటకే వైద్యం అందిస్తూ ఉచితంగా మందులను అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్ రాజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్రనాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.